సాక్షి
అనకాపల్లి

సోమవారం । 12 । ఫిబ్రవరి । 2024



నర్సుల అపూర్వ సమ్మేళనం

విశాఖ: కేజీహెచ్ నర్సింగ్ కాలేజీ 1986 బ్యాచ్ నర్సులు 12 ఏళ్ల తర్వాత ముడసర్లోవ పార్కులో కలిశారు.



గాన గంధర్వుడు ఘంటసాల

ఘంటసాల వర్ధంతి సందర్భంగా యలమంచిలిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పాటల పోటీలు అలరించాయి. 8లో



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

విశాఖ సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రంలో మెడికల్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఐఈఓ సుజాత

అనకాపల్లి: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 60 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు మొదటి రోజు 3,074 మందికి గాను 2,943 మంది విద్యార్థులు హాజరయ్యారు. 131 మంది గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారి(డీఐఈవో) వి.సుజాత చెప్పారు. ఈనెల 20వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం ఏర్పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు.

‘దిశ’ డీఎస్పీ ఉపేంద్రబాబు బాధ్యతల స్వీకారం



అనకాపల్లి: అనకాపల్లి దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీగా ఎం.ఉపేంద్రబాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కర్నూలు జిల్లాలో సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ‘దిశ’ డీఎస్పీగా నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన మళ్ల మహేష్ అమలాపురం డీఎస్పీగా నెలరోజుల క్రితం బదిలీపై వెళ్లారు.

వీర పరాక్రమ ధీరుడు హనుమంతుడు



సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న దంపతులు

ఎంవీపీకాలనీ (విశాఖ): సామవేదం షణ్ముఖ శర్మ హనుమద్వైభవ ప్రవచనాలు ఎంవీపీ కాలనీలో ఆదివారం కొనసాగాయి. ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కు వేదికగా షణ్ముఖ శర్మ హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో హనుమద్వైభవ ప్రవచనాలు నాలుగు రోజులుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా షణ్ముఖశర్మ మాట్లాడుతూ మహావీర, పరాక్రమ, ధీరుడు హనుమంతుడు అని చెప్పారు. శ్రీ తులసీదాస్ మానవాళికి అందించిన హనుమాన్ చాలీసా జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ ఒడిసిపట్టుకోడంతో పాటు పిల్లలకు తెలియజెప్పాలన్నారు. దీని ద్వారా మానసిక స్థైర్యం లభిస్తుందని చెప్పారు. ప్రవచనాలతో పాటు ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రవచనాలు అనంతరం భక్తులు పెద్ద ఎత్తున షణ్ముఖ శర్మ ఆశీస్సులు తీసుకున్నారు.

అయోధ్యకు విశాఖ వాసులు



రైల్వే స్టేషన్‌లో అయోధ్య ప్రయాణికులు

తాటిచెట్లపాలెం : ఇటీవల అయోధ్యలో ప్రాణ ప్రతిష్ట చేసిన ప్రాంతాన్ని దర్శించుకునేందుకు నగర వాసులు పయనమయ్యారు. ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో నడుపుతున్న పలు ప్రత్యేక రైళ్లలో ఆయా ప్రాంతాల నుంచి ప్రజలు అయోధ్యకు తరలివెళ్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం కాకినాడలో బయల్దేరిన కాకినాడ – అయోధ్య ధాం ఆస్థా స్పెషల్ రైలు ఆదివారం రాత్రి విశాఖపట్నం రైల్వేస్టేషన్ ఒకటో నంబర్‌కు చేరుకుంది. ఈ స్పెషల్ రైలు రాత్రి 10.20గంటలకు విశాఖ నుంచి అయోధ్యకు బయల్దేరింది. ఇప్పటికే టికెట్స్ బుక్ చేసుకున్న నగర పరిసర ప్రాంత వాసులు సుమారు 350 మంది విశాఖలో ఈ ప్రత్యేక రైలెక్కి అయోధ్యకు పయనమయ్యారు. రైల్వే స్టేషన్ స్టేషన్‌మేనేజర్ అరుణశ్రీ, ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో గవర్నమెంట్ రైల్వే పోలీస్, రైల్వే భద్రతా దళం సిబ్బంది పర్యవేక్షించారు.

- ప్రతిపక్షాల కుయుక్తులకు చెక్

మార్గం సుగమం



అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి

లక్షలాదిమంది కార్మికులు, ఉద్యోగుల అవసరాలను గుర్తించిన ప్రభుత్వం ప్రతిపక్షాల ఎత్తులను చిత్తు చేస్తూ.. అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి నిర్మాణానికి మార్గం సుగమం చేసింది. వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో తాత్కాలికంగా రహదారి మరమ్మతులు చేపట్టేందుకు రూ.6.5 కోట్ల నిధులు కేటాయించారు. ఈ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈనెల 10న శనివారం టెండర్ పిలిచారు. ఈనెల 17 దీనికి గడువు తేదీ. 22న నాటికి షార్ట్ టెండర్ ప్రక్రియ పూర్తవుతోంది. ఈ తరువాత నుంచి నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. రోడ్డు విస్తరణకు భూ సేకరణ ప్రక్రియ కొనసాగిస్తూనే ప్రభుత్వం తాత్కాలిక పనులను చేపట్టనుంది.

- అచ్యుతాపురం-అనకాపల్లి రహదారిపై తాత్కాలిక పనులు
- రూ.6.5 కోట్ల వీఎంఆర్డీఏ నిధులతో 14 కి.మీ. మేర నిర్మాణం
- రహదారి విస్తరణకు సాంకేతిక అడ్డంకులు సృష్టించిన ప్రతిపక్షాలు
- వారి కుట్రలకు చెక్ పెడుతూ ముందుగా మరమ్మతులు చేపట్టాలని నిర్ణయం
- ఈనెల 22 నుంచి యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభం

సాక్షి, అనకాపల్లి: అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి విస్తరణ ప్రాజెక్టు ఈనాటిది కాదు. పరిశ్రమలకు నెలవైన ఈ ప్రాంతంలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. లక్షలాదిమంది కార్మికులు, ఉద్యోగులు వస్తూ పోతూ ఉంటారు. అనకాపల్లి బైపాస్ నుంచి అచ్యుతాపురం వరకు 14 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరించడంతోపాటు పారిశ్రామికవాడల్లో రహదారులు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఏడీబీ నిధులు మంజూరు చేసేందుకు 2016లో ఆమోద ముద్ర పడింది. టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే ఈనాటికీ అది కార్యరూపం దాల్చలేదు. రైతుల నుంచి భూసేకరణ ప్రక్రియ ఆనాడే పూర్తి చేసి ఉంటే ప్రస్తుతం ఈ రోడ్డుకు ఆ పరిస్థితి ఏర్పడి ఉండేది కాదు. అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి నిర్మాణానికి సుమారు రూ.243 కోట్ల ఏడీబీ నిధులు కేటాయించేలా ప్రతిపాదనలు సిద్ధం చేసినా విపరీతమైన కాలయాపన చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసింది. దాదాపు రూ.400 కోట్లకుపైగా నిధులతో రోడ్డు విస్తరణ పనులకు భూసేకరణ ప్రక్రియను కొనసాగించింది. కానీ కొందరు రైతులు సహకరించకపోవడంతో అనుకున్న విధంగా ముందుకు సాగలేదు. అధికారులు జీపీ అగ్రహారం, నాగులాపల్లి, తోటాడ, మునగపాక, తిమ్మరాజుపేట, హరిపాలెం, కొండకర్ల, చోడపల్లి రైతులతో దశలవారీగా చర్చలు జరిపారు. ప్రతిపక్షాల జోక్యంతో ఈ వ్యవహారం కొలిక్కిరాకపోవడంతో ఈ రోడ్డు విస్తరణ పనులు ఆగిపోయాయి. పరిశ్రమల యాజమాన్యాలు, ఉద్యోగులు, కళాశాల విద్యార్థులు, వివిధ రంగాల వారు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తుండగా భూమిని ఇచ్చే విషయంలో రైతులు పట్టుదల ప్రదర్శిస్తున్నారు. ఈ సమయంలో ప్రతిపక్ష టీడీపీ ఆదేపనిగా రాజకీయ దుష్ప్రచారం చేస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ఈ రోడ్డుకు అధ్వాన పరిస్థితి ఏర్పడిందన్నది జగమెరిగిన సత్యమే.

ఎమ్మెల్యే కన్నబాబురాజు చొరవతో..

రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రయాణికులు క్షేమంగా గమ్యాన్ని చేరుకోవాలనే లక్ష్యంతో స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజు ఈ పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. పలుమార్లు వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సుబ్బారెడ్డి కృషితో తాత్కాలికంగా రోడ్డు నిర్మాణానికి వీఎంఆర్డీఏ నుంచి రూ.6.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో ప్రధానంగా అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డులో మరమ్మతులు, తాత్కాలిక నిర్మాణ పనులు ప్రారంభించేందుకు రంగం సిద్ధమవుతోంది. రోడ్డు విస్తరణకు భూ సేకరణ ప్రక్రియ కొనసాగిస్తూనే ప్రభుత్వం తాత్కాలిక పనులను చేపట్టనుంది.

యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తాం..



ఏడీబీ నిధులు మంజూరు చేయడంతో రోడ్డు విస్తరణకు టెండర్ ప్రక్రియ ప్రారంభమైంది. భూ సేకరణకు రైతుల సహాయ నిరాకరణ కారణంగానే ఇది నిలిచిపోయింది. ఆ ప్రక్రియ ఒకపక్క కొనసాగుతుండగానే అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు మరమ్మతులకు, తాత్కాలిక పనులకు ప్రభుత్వం వీఎంఆర్డీఏ నిధులు మంజూరు చేసింది. ఈ రోడ్డుపై హెవీ వాహనాలు, లారీల రాకపోకలు నిలిపివేస్తాం. ప్రయాణికులు, ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు, బస్సులు, పరిశ్రమల ఉద్యోగుల బస్సులతో పాటు లైట్ వెయిట్ వాహనాల వరకే ఈ రోడ్డుపై అనుమతించేలా చర్యలు తీసుకుంటున్నాం. వీలైనంత మేర హెవీ వాహనాలను లంకెలపాలెం రోడ్డుకు మళ్లించడం జరుగుతోంది. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేసిన వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు.

– కన్నబాబురాజు, యలమంచిలి ఎమ్మెల్యే

క్రీడా ఆణి‘ముత్యం’ లక్ష్మి

జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో బంగారు , వెండి పతకాలు



సాధించిన పతకాలతో ముత్యం లక్ష్మి

చోడవరం: జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో చోడవరానికి చెందిన వెటరన్ క్రీడాకారిణి ముత్యం లక్ష్మి బంగారం, సిల్వర్ పతకాలు సాధించారు. 5వ జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు హైదరాబాద్‌లో ఈనెల 7నుంచి 11వతేదీ వరకూ జరిగాయి. ఈ పోటీల్లో జావెలిన్ త్రో, డిస్క్ త్రో, షాట్‌పుట్ విభాగాల్లో 75 ఏళ్ల వెటరన్ క్రీడాకారిణి ముత్యం లక్ష్మి పాల్గొని, ప్రతిభ కనబరిచారు. జావెలిన్ త్రోలో బంగారు పతకం, డిస్క్ త్రో, షాట్‌పుట్ పోటీల్లో వెండి పతకాలు సాధించారు. ఈమె ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర వెటరన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడల్లో అనేక సార్లు పాల్గొని వివిధ విభాగాల్లో పలు పతకాలు సాధించారు. తాజాగా జరిగిన జాతీయ పోటీల్లో కూడా ముత్యం లక్ష్మి పతకాలు సాధించడంతో చోడవరం ప్రజలు, క్రీడాకారులు, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు అభినందించారు.

నేడు డయల్ యువర్ మేయర్, ‘జగనన్నకు చెబుదాం’

డాబాగార్డెన్స్ (విశాఖ): జీవీఎంసీలో సోమవారం డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి 11 వరకు మేయర్ చాంబర్లో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి డయల్ యువర్ మేయర్ కార్యక్రమం చేపట్టనున్నారు. అనంతరం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం (గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించనున్నారు. డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో పాల్గొనే వారు టోల్ ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి సమస్యలు తెలపవచ్చు.

‘ఆడుదాం ఆంధ్రా’ ఫైనల్స్‌కు సీఎం జగన్

- రేపు విశాఖలో క్రికెట్ ఫైనల్ మ్యాచ్ వీక్షించనున్న ముఖ్యమంత్రి
- విజేతలకు బహుమతుల ప్రదానం



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖ రానున్నారు. ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర స్థాయి ముగింపు వేడుకల్లో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. ఈ మేరకు ఆదివారం పర్యటన షెడ్యూల్ ఖరారు చేశారు. మంగళవారం సాయంత్రం 5.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధురవాడ ఐటీ హిల్స్–3 వద్ద గల హెలీప్యాడ్ వద్దకు 5.30 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన 6 గంటలకు పీఎం పాలెం వైఎస్సార్ క్రికెట్ స్టేడియంకు చేరుకుంటారు. సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకూ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ (చివరి ఐదు ఓవర్లు) సీఎం వీక్షిస్తారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగిస్తారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తారు. రాత్రి 8.05 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 8.30 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 8.35 గంటలకు విమానంలో గన్నవరంకు బయలుదేరుతారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

విశాఖ స్పోర్ట్స్ : విశాఖ వేదికగా మంగళవారం ఆడుదాం ఆంధ్రా ముగింపు వేడుకలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేస్తున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లపై ఆదివారం వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటనను అధికారులంతా సమన్వయంతో విజయవంతం చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న ఆదేశించారు. కలెక్టర్ ఎ.మల్లికార్జునతో కలిసి అధికారులంతా స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రద్యుమ్న మాట్లాడుతూ సమన్వయ లోపం తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. మంగళవారం సాయంత్రం జరిగే కార్యక్రమ షెడ్యూల్‌ను అధికారులకు వివరించారు. అన్ని విభాగాల అధికారులు చేపట్టాల్సిన బాధ్యతలను వివరించారు.

కలెక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం సమష్టిగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. క్రీడాకారులతో పాటు సాధారణ ప్రజలకు ఆహారం, తాగునీటి సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమం సజావుగా జరిగేందుకు జిల్లా యంత్రాంగం, పోలీస్ యంత్రాంగం, శాప్ నుంచి ఒక్కొక్క ఇన్‌చార్జిని నియమిస్తున్నామని వెల్లడించారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఆధ్యాత్మిక చింతనతోనే చింతలు దూరం



యాగ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్వామి



దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి



ప్రవచనాలు వింటున్న భక్తులు

అనకాపల్లి: చింతామణి గణపతి ఆరాధన, ఆధ్యాత్మిక చింతనతో .. చింతలన్నీ దూరమవుతాయని దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి తెలిపారు. జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లి కొత్తూరు చింతామణి గణపతి దత్తక్షేత్రంలో ఆదివారం మహాగణపతి యాగం, ప్రధాన దేవతామూర్తులకు మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న స్వామి, అనంతరం ప్రవచించారు. దేశం, రాష్ట్రం పాడిపంటలతో సస్యశామలంగా ఉండి, ప్రజలు సంతోషంగా ఉండాలన్నారు. గణపతి దత్తక్షేత్రాన్ని 1992లో నిర్మించి, చింతామణి గణపతి, రామాలయం, శివాలయం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 12 సంవత్సరాలకొకసారి ఆలయాల్లో దేవతామూర్తులకు కుంభాభిషేకం చేయాలని, మానవుని జీవితంలో ప్రతి ఒక్కరికీ 12 సంవత్సరాలకొకసారి కాలచక్రం మారుతుందన్నారు. కాలచక్రం మారుతున్నప్పుడల్లా ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంచుకోవాలని సూచించారు. చింతామణి గణపతిని ప్రార్థించడం ద్వారా చింతలన్నీ దూరమవుతాయని తెలిపారు.

అంతకు ముందు ఉదయం చక్రార్చన, యాగ పూర్ణాహుతి, దేవతామూర్తులకు మహాకుంభాభిషేకం, ప్రసాద వితరణ, సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గత మూడు రోజులుగా ఇక్కడ ఆలయాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో క్షేత్ర నిర్వాహకులు ఆంజనేయరాజు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

ఈ ప్రగతి చరిత్రాత్మకం..

సంక్షేమం అనితర సాధ్యం



ముత్యాలనాయుడును సత్కరిస్తున్న ఎంపీపీ దంపతులు



బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన జనం

- సీఎం జగన్ సహకారంతో అభివృద్ధి పథంలో దేవరాపల్లి
- రూ.92.09 కోట్లతో అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పన
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో దేవరాపల్లి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేయగలిగానని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఇందు కోసం రూ. 92.09 కోట్ల మేర నిధులు వెచ్చించి అభివృద్ధిలో దేవరాపల్లిని రోల్‌మోడల్‌గా మార్చామన్నారు. దేవరాపల్లిలో రైవాడ అతిథి గృహ ఆవరణలో ఆదివారం జరిగిన భారీ బహిరంగ సభలో స్థానిక ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో స్థానిక ప్రజలు, రైతులు ఎంతో కాలంగా పడుతున్న అవస్థలను స్వయంగా చూశానన్నారు. తన ఎదుగుదలకు అనునిత్యం అండగా ఉంటున్న ఇక్కడి ప్రజల కష్టాలను తీర్చాలన్న ఆకాంక్షతో ప్రణాళికబద్ధంగా మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టానన్నారు. కొల్లూరి వారి వీధిలో సీసీ రోడ్డుతో ప్రారంభమైన అభివృద్ధి పనులు యజ్ఞంలా నిరాటంకంగా ముందుకు సాగాయన్నారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, కిలపర్తి భాస్కరరావు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మతో కలిసి అభివృద్ధిని పరుగులు పెట్టించగలిగామన్నారు. రూ.1.87 కోట్లతో 7 ప్రభుత్వ భవనాలు, రూ.7 కోట్ల వ్యయంతో 54 సీసీ రోడ్లు, రూ. 22.20 కోట్లతో 8 తారు రోడ్లు, రూ.56 లక్షలతో నాలుగు సీసీ డ్రైనేజీలు, జల జీవన్ మిషన్ పథకం ద్వారా రూ. 5.64 వ్యయంతో నూతన ట్యాంక్‌లతో ఇంటింటికీ కుళాయి సదుపాయం కల్పిస్తున్నామన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి రూ.1.70 కోట్లతో నూతన భవనాన్ని, రూ.కోటి వ్యయంతో పార్కును నిర్మిస్తున్నామన్నారు. రూ.కోటి వ్యయంతో నూతన కల్యాణమండపాన్ని నిర్మించడానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం జగన్‌ను రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎంగా గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం ముత్యాలనాయుడును ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, భాస్కరరావు దంపతులు ఘనంగా సత్కరించారు. నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు సైతం సన్మానించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, జెడ్పీటీసీ కర్రి సత్యం, కె.కోటపాడు, మాడుగుల ఎంపీపీలు రెడ్డి జగన్ మోహన్, తాళ్లపురెడ్డి రాజారామ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ డా.వి.సింహాచలంనాయుడు, వైస్ ఎంపీపీ ఉగ్రాకుల గంగాభవాని, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, తదితర్లు పాల్గొన్నారు.

అసిస్టెంట్ కలెక్టర్ దంపతులకు సత్కారం



అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: వైఎస్సార్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్ దంపతులను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆదివారం సత్కరించారు. ఇటీవల వివాహం చేసుకున్న అసిస్టెంట్ కలెక్టర్ తన స్వగ్రామం నర్సీపట్నం విచ్చేశారు. ఈ మేరకు అసిస్టెంట్ కలెక్టర్ ఇంటికెళ్లి మౌర్య భరద్వాజ్, కిరణ్మయి దంపతులకు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. వార్డు కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి ఉన్నారు.

నలుగురు పేకాటరాయళ్లు అరెస్ట్

బుచ్చెయ్యపేట: మండలంలోని రాజాం గ్రామ శివారులో పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు బుచ్చెయ్యపేట ఎస్ఐ డి. ఈశ్వరరావు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేసి వారిని పట్టుకున్నామన్నారు. రూ.4,260, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అంబరాన్నంటిన ప్రారంభోత్సవాల సంబరం

- రూ. 2.67 కోట్లతో నిర్మించిన నూతన ఎంపీడీవో భవనం
- రూ. 60 లక్షలతో ఆధునీకరించిన ఆర్టీసీ కాంప్లెక్స్
- ప్రారంభించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- రూ. 92.09 కోట్లతో చేపట్టిన సంక్షేమాభివృద్ధి పైలాన్ ఆవిష్కరణ



దేవరాపల్లి నాలుగు రోడ్ల కూడలిలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు గజమాలతో సత్కారం



దేవరాపల్లిలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి వివరాలతో కూడిన పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



ఆర్టీసీ కాంప్లెక్స్ ఆధునీకరణ శిలాఫలకావిష్కరణలో..

దేవరాపల్లి: అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల కార్యక్రమం అంబరాన్నంటింది. దేవరాపల్లిలో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమానికి దేవరాపల్లి ఊరంతా తరలిరావడంతో ఇక్కడ ప్రధాన రహదార్లన్నీ జనసంద్రంగా మారాయి. గ్రామాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు ఆధ్వర్యంలో గజమాలతో ఘనంగా సత్కరించారు. అక్కడ డాక్టరు బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి డిప్యూటీ సీఎం నివాళులర్పించారు. అనంతరం దేవరాపల్లి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో రూ. 92.09 కోట్లతో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనుల వివరాలతో కూడిన పైలాన్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రానికి రోల్ మోడల్‌గా అధునిక హంగులతో రూ. 2.67 కోట్లతో నిర్మించిన నూతన ఎంపీడీవో భవనాన్ని ప్రారంభించారు. రూ. 60 లక్షలతో ఆధునీకరించిన ఆర్టీసీ కాంప్లెక్స్ భవన సముదాయ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నూతన ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాజేశ్వరిని ఆమె చాంబర్‌లో కూర్చోబెట్టి ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, జెడ్పీటీసీ కర్రి సత్యం, కె.కోటపాడు ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, మాడుగుల ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారామ్, చీడికాడ నాయకులు లాలం జానకీరామ, కురచా నారాయణమూర్తి, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, పార్టీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, కర్రి సూరినాయుడు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డాక్టరు వీ సింహాచలంనాయుడు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, వైస్ ఎంపీపీ ఉగ్రాకుల గంగాభవానీ, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ, వరదపురెడ్డి లలితానాయుడు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట : ఎమ్మెల్యే గణేష్



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. నర్సీపట్నం మండలం అమలాపురంలో రూ.21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎంపీపీ సుర్ల రాజేశ్వరితో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయం దండగ అనుకున్న సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పండగ చేసిందన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.13,500 ఇస్తుందన్నారు. గ్రామ స్థాయిలోనే రైతులకు అవసరమైన సేవలందించాలని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారన్నారు. దీనిలో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో రైతు భరోసా కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. వీటి ద్వారా విత్తనాలు, ఎరువులు పొందవచ్చన్నారు. సర్పంచ్ శెట్టి అచ్చిరాజు, పార్టీ మండలాధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

ధ్వంసమైన కల్యాణపులోవ కాలువ అక్విడెక్టు

కోతకు గురైన కాలువ గట్టు



ములకలాపల్లి వద్ద ధ్వంసమైన అక్విడెక్ట్

రావికమతం: కల్యాణపులోవ ప్రధాన కాలువలో ములకలాపల్లి వద్ద అక్విడెక్ట్ ఆదివారం దెబ్బతింది. దీంతో కాలువలో పారే లీకేజీ నీరు గట్టులోంచి ప్రవహిస్తూ మరింతగా కోతకు గురైంది. ములకలాపల్లి, చీమలపాడు వద్ద అక్విడెక్ట్‌లు దెబ్బతినడంతో ఇటీవల రూ.9 లక్షల ఎంపీ నిధులతో మరమ్మతులు చేపట్టారు. అయితే కాలువ లోపల కాంక్రీటు పనులు లోపభూయిష్టంగా చేపట్టడం, గట్టుకు మరోవైపు రాతి పేర్పును వదిలి వేశారు. దీంతో నీరు లీకై రాతి పేర్పుతోపాటు కాలువ గట్టు మట్టి దొలిచి వేసింది. దీనిని తక్షణం మరమ్మతులు చేపట్టకపోతే కాలువ మొత్తం కోతకు గురయ్యే ప్రమాదముందని తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణ దొరను సంప్రదించగా ధ్వంసమైన అక్విడెక్ట్‌ను పరిశీలించామన్నారు. ఇటీవల కాలువ లోపలే యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి ఖరీఫ్‌కు విజయవంతంగా నీరందించామన్నారు. కాలువ పూర్తి అభివృద్ధికి రూ.20 లక్షలతో ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

గాన గంధర్వుడు ఘంటసాల

- మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి
- ఉర్రూతలూగించిన రాష్ట్ర స్థాయి పాటల పోటీలు
- స్వరాలు వినిపించిన తెలుగు రాష్ట్రాల గాయకులు



హాజరైన ఘంటసాల అభిమానులు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న వక్తలు

యలమంచిలి: రాష్ట్ర స్థాయి పాటల పోటీలు సంగీత ప్రియులను ఉర్రూతలూగించాయి. గాన గంధర్వుడు, స్వర మాంత్రికుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం యలమంచిలిలో ఈ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన 42 మంది గాయనీగాయకులు సీనియర్, జూనియర్ విభాగాల్లో ఆలపించిన పలు ఘంటసాల గీతాలు ఓలలాడించాయి. తొలుత కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు పాటలకు పునరుజ్జీవం పోసిన గాన గంధర్వుడు ఘంటసాల అని అలనాటి మధుర గీతాలు, భగవద్గీత వంటి గీతాలు, పద్యాలు ఆలపించి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. నేపథ్య గాయకుడిగా అనేక పాటలు విషాద, ఆనంద హాస్యరస పాటలు అన్ని కోణాల్లో సంగీత ప్రియులను రంజింపజేశాయని, సినీ ప్రపంచానికి ఆయన అందించిన గీతాలు మరువరానివని కొనియాడారు. అనంతరం స్థానిక ఘంటసాల కళా మందిరంలో సినీ సంగీత విభావరిని సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించి ఘంటసాల గీతాలను ఆలపించారు. ఈ పోటీల్లో విజేతలకు ఎంపీపీ బోదెపు గోవింద్, యలమంచిలి ఏఎంసీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ సభ్యులు ముత్తుర్తి రామారావు, ఎలిశెట్టి రామారావు, ఇదటూరి సాంబశివరావు, బంగారు శెట్టి, మళ్ల కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రిమిసంహారక మందు సేవించి యువకుడి మృతి



మృతుడు అంజి

కె.కోటపాడు: మండలంలోని చౌడువాడ గ్రామానికి చెందిన శానాపతి అంజి(34) క్రిమిసంహారక మందు సేవించి విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. అతడి మృతిపై కె.కోటపాడు పోలీసులకు ఆయన తండ్రి అప్పారావు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ లక్ష్మీనారాయణ వివరాల ప్రకారం... చౌడువాడకు చెందిన అంజికి మూడేళ్ల క్రితం ప్రమాదంలో చేయి విరిగిపోయింది. దివ్యాంగత్వంతో తన పొలం పండించుకునే పరిస్థితి లేకపోవడంతో భార్య, ఇద్దరు పిల్లల పోషణపై ఎప్పుడూ మదన పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో శనివారం క్రిమిసంహారక మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకోవడంతో అంజిని కె.కోటపాడు సీహెచ్‌సీకి కుటుంబ సభ్యులు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొట్టి భార్య దుర్మరణం

భర్తకు స్వల్ప గాయాలు



రోడ్డుపై కాశీ కనక శ్రీదేవి మృతదేహం

కశింకోట: లారీ ఢీకొట్టిన ప్రమాదంలో భార్య దుర్మరణం చెందగా, భర్త స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ ప్రమాదం మండలంలోని బయ్యవరం రైల్వే ఫ్లైఓవర్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. సీఐ ఎం. వినోద్‌బాబు వివరాల ప్రకారం.. అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళ్తున్న మోటారు సైకిల్‌ను వెనుక నుంచి లారీ వచ్చి ఢీకొంది. దీంతో దానిపై వెళ్తున్న చోడవరం మండలం అంబేరుపురం గ్రామానికి చెందిన కాశీ కనక శ్రీదేవి (45) అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త రాము స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. యలమంచిలిలో తమ బంధువుల ఇంటికి భార్యాభర్తలు కలిసి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదానికి గురయ్యారు. మృతురాలు అచ్యుతాపురం వద్ద బ్రాండెక్స్ కంపెనీలో పని చేసేది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉప్పొంగిన ఆత్మీయత

తాండవలో సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహం

నాతవరం: చదువుల తల్లి ఒడిలో వారి బాల్య జ్ఞాపకాలు కళ్లముందు కదలాడాయి. ఆనాటి అల్లరి పనులు.. చిలిపి చేష్టలు.. అబ్బో ఒకటేమిటి అనేకం ఊసులాడాయి. వాటిని నెమరువేసుకుంటూ ఈనాటి యోగక్షేమాలను తెలుసుకుంటూ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సందడిగా సాగింది. నాతవరం మండలం తాండవ హైస్కూల్‌లో చదువుకున్న వారంతా ఆదివారం ఇక్కడ కలుసుకున్నారు. వీరిలో వృద్ధాప్య దశకు చేరిన కొంతమంది ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేస్తూ ఆలింగనం చేసుకున్నారు. 1965లో తాండవ హైస్కూల్ ఏర్పడింది. ఆనాటి నుంచి నేటి వరకు చదువుకున్న 650 మంది విద్యార్థులు హాజరయ్యారు. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా రావడంతో ఇక్కడ నూతన వాతావరణం సంతరించుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు హైస్కూల్‌లో ఆటపాటలతో సందడి చేశారు. ముందుగా హైస్కూల్‌లో చదువుకుని మరణించిన వారికి మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. పూర్వ విద్యార్థి రాంబాబు సహకారంతో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పూర్వ గురువులను ఘనంగా సత్కరించారు. ఏటా ఇదే విధంగా అపూర్వ సమ్మేళనం కావాలని మనతో చదువుకున్న వారు ఆర్థికంగా వెనకబడినా, ఆరోగ్యపరంగా ఇబ్బంది పడినా ఆదుకునేందుకు, స్కూల్‌ని అభివృద్ధి చేసేందుకు తీర్మానం చేసుకున్నారు.

అంకెల గారడీ

బడ్జెట్‌పై కొణతాల విమర్శలు

తుమ్మపాల: రాష్ట్ర బడ్జెట్ గొప్పలు చెప్పుకుంటూ వాస్తవాలకు విరుద్ధంగా ఉందని జనసేన నేత, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అన్నారు. పట్టణంలో టీచర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.8 లక్షల 60 వేల కోట్లు అప్పులు చేసిందని, మళ్లీ ఈ ఏడాది బడ్జెట్‌లో మరో రూ.81 వేల కోట్లు రుణాలు తీసుకోవాలని ప్రతిపాదన పెట్టారన్నారు. రాష్ట్ర ఆదాయంలో 25 శాతం కేవలం వడ్డీలు కట్టడానికి సరిపోతుందన్నారు. వ్యవసాయ రంగానికి 2019 నుంచి 2024 ఏడాది వరకు కేటాయించిన బడ్జెట్ రూ.75 వేల కోట్లు కాగా ఖర్చు చేసింది రూ.43 వేల 600 కోట్లు మాత్రమేనన్నారు. గృహనిర్మాణంపై ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ.8 వేల కోట్లు బడ్జెట్ కేటాయింపులు చేసి కేవలం రూ.4 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వెంగళరాయసాగర్, పోలవరం ప్రాజెక్టు, కోటపల్లి వంటి అనేక ప్రాజెక్టులు ముందుకు వెళ్లిన పరిస్థితి లేదన్నారు. డీఎస్సీ అని చెప్పి 25 వేల పోస్టులకు గాను కేవలం 6 వేలు తీస్తున్నారని విమర్శించారు.

మంచుకోరల్లో జీడి, మామిడి

- వేలాది ఎకరాల్లో రాలిపోతున్న పూత, పిందె
- మామిడి రైతుల ఆందోళన



పూతరాలిపోయిన జీడిమామిడి చెట్టు



మంచుకు మాడిపోయిన మామిడి పూత

చోడవరం: వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో మామిడి, జీడిమామిడి రైతులు కలవరం చెందుతున్నారు. ఉష్ణోగ్రతలు బాగా పడిపోవడం, మంచు కురవడం, పొగమంచు కమ్ముకోవడంతో పూత దశలోనే పంట నష్టాలకు గురవుతోంది. జిల్లాలో లక్ష ఎకరాల్లో మామిడి, జీడిమామిడి తోటలు ఉన్నాయి. ఈ పంటలపై ఏటా రూ.60 కోట్ల నుంచి రూ.80 కోట్ల మేర వ్యాపారం సాగుతోంది. డిసెంబరు నుంచి పూత ప్రారంభమైన మామిడి, జీడిమామిడి పంటలకు 15 రోజుల వరకు ఉష్ణోగ్రతలు బాగానే అనుకూలించాయి. మంచు కొద్దిగానే కురవడంతో పూత ప్రారంభంలో ఉష్ణోగ్రతల వల్ల ఎటువంటి ఇబ్బంది లేకపోవడంతో తోటలన్నీ కళకళలాడాయి. రెండు వారాలుగా వాతావరణంలో భారీ మార్పులు ఏర్పడి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. మంచు ప్రభావంతో సాయంత్రం నుంచి ఉదయం 9 గంటల వరకూ విపరీతంగా పొగమంచు కురుస్తోంది. 30 శాతానికి పైబడి పూత, ప్రాథమిక దశలో పిందె ఇప్పటికే రాలిపోయింది. ఇదే పరిస్థితి మరిన్ని రోజులు కొనసాగితే పూత మరింత నష్టపోయే ప్రమాదం ఉంది. చోడవరం, మాడుగుల, నర్సీపట్నం, పాయకరావుపేట, యలమంచిలి, పెందుర్తి నియోజకవర్గాల్లో ఎక్కువగా మామిడి, జీడిమామిడి సాగులో ఉంది. సాధారణ తోటలతోపాటు హైబ్రిడ్ తోటలు బాగా పూతదశలో ఉన్నాయి. ఈ తోటలు మంచు బారిన పడ్డాయి. పూతను కాపాడుకోవడానికి రైతులు పలు రకాల మందులు పిచికారీ చేస్తున్నా, ఫలితం మాత్రం స్వల్పంగానే ఉందని ఆందోళన చెందుతున్నారు.

పూత చాలా దెబ్బతింది

నేను ఐదెకరాల మామిడి తోట కౌలుకు తీసుకున్నాను. రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. పూత మొదటి దశలో చాలా బాగుంది. ఈ సారి తోట బాగా కాస్తుందని అనుకున్నాను. ఈ మధ్య మంచు చాలా ఎక్కువగా పడుతుండటంతో చాలా మేర పూత మాడిపోయి రాలిపోయింది. పెట్టుబడి కూడా వచ్చేలా లేదు.

– అప్పలనాయుడు, మామిడిరైతు

పోషకాలు వేయాలి

తేనె మంచు పురుగులు ఎక్కువగా పూతకు పడతాయి. ఇవి పూతపై ప్రభావం చూపడంతో దెబ్బతింటుంది. మామిడి, జీడిమామిడి తోటలకు పోషకాలు వేయాలి. 13045 ఎరువును పూతకు పిచికారీ చేస్తే ఆ నష్టం నుంచి రక్షించుకోవచ్చు. ఇమిడాక్లోప్రిడ్ 0.5మిల్లీలీటరు, లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

– గణేష్, ఏరియా ఉద్యానవనశాఖ అధికారి

క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణస్వామి

అనకాపల్లి: మాఘమాసాన్ని పురస్కరించుకొని స్థానిక సుంకరమెట్ట జంక్షన్‌లో సూర్యనారాయణ, సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం సూర్యదేవునికి ప్రత్యేక పూజలు అర్చకుడు విద్యాసాగర్‌శర్మ నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామివారి దర్శనానికి ఆలయానికి భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం ఏర్పడకుండా ఆలయ చైర్మన్ కేఎం.నాయుడు చర్యలు చేపట్టారు. ఆలయ ధర్మకర్తలు నేతల చంద్రకళ, పెంటకోట అప్పలనాయుడు, నర్సింగరావు, మారిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేంద్ర సంక్షేమ పథకాల క్యాలెండర్ ఆవిష్కరణ

తుమ్మపాల : దేశంలో ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందించింది బీజేపీ ప్రభుత్వం అని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వుడా రమేష్ అన్నారు. మండలం మారేడుపూడి గ్రామంలో పల్లెకు పోదాం (గావ్ చలో అభియాన్) కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ఆవిష్కరించి క్యాలెండరు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో అన్ని రంగాల్లోను గడిచిన పదేళ్లలో అభివృద్ధి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కర్రిరి తాతారావు, సీనియర్ నాయకుడు బొడ్డేడ శేషగిరిరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య యోగం



యోగా గురువులు ప్రభ సాహోతో నిర్వాహకులు

అనకాపల్లి : నిరంతరం యోగాతోనే ఆరోగ్య యోగ్యత కలుగుతుందని భారత స్వాభిమాన ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రభ సాహో, ట్రస్ట్ అధ్యక్షుడు, యోగా గురువులు బీశెట్టి దోరమ నాయుడు అన్నారు. స్థానిక జూనియర్ ఆవరణలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత యోగ శిక్షణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రభ సాహో మాట్లాడుతూ ఆత్మచేర సమస్యలకు ఎక్కువ శాతం సూర్యనమస్కారాల సాధన మంచిదన్నారు. కొన్ని రకాల ఆసనాల సాధన ప్రత్యేక వ్యాధి నిరోధకానికి ఉపయోగపడతాయని ఆమె చెప్పారు. అనేక అనారోగ్య సమస్యలతో పాటు ప్రపంచాన్ని ఆరోగ్యం వైపు నడిపే చక్కనైన మార్గాలు యోగాలో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అధ్యక్షుడు బుద్ధ కాశీ విశ్వనాథం, కాంట్రేకుల దిన్ను, కోండ కన్నబాబు, బీ.శ్రీనివాసరావు, కాళ్ల సత్యనారాయణ, నాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
అంబాజీపేట మ్యారేజిబ్యాండు	: సత్యనారాయణస్క్రీన్-1
ఈగల్	: సత్యనారాయణస్క్రీన్-2
యాత్ర-2	: పద్మసాయి
లాల్‌సలామ్	: పద్మసాయి
గేమ్ ఆన్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 19 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-11 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయంలో బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 269 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 251మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

వాసవీ మాతకు ప్రత్యేక అభిషేకాలు



అమ్మవారి విగ్రహానికి పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు



గోపూజలో పాల్గొన్న భక్తులు



అమ్మవారి ఉత్సవమూర్తితో నగరసంకీర్తనలో మహిళా భక్తులు

అనకాపల్లి : వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినం సందర్భంగా మెయిన్‌రోడ్డులో గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామున నగర సంకీర్తనను పురస్కరించుకొని అమ్మవారి ఉత్సవమూర్తిని పట్టణంలో ఊరేగించారు. ఆలయంలో అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో కూడిన పంచామృతాభిషేకం చేపట్టారు. లలిత సహస్ర నామ స్తోత్ర పారాయణం, గోపూజ, మధ్యాహ్నం అన్న సమారాధన, రాత్రికి 102 వెండి ప్రమిదల జ్యోతుల ఆరాధనతో వేదకలు ముగుస్తాయని ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పుల శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరమ్మ నిమజ్జనోత్సవం



గవరపేట పెద్దగుమ్మం వద్ద శారదానదిలో గౌరమ్మ నిమజ్జనం



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమ ప్రదర్శన

కొంకోట : కొంకోటలో ప్రసిద్ధి చెందిన టీఏస్ జెడ్పీ హైస్కూలు వద్ద వెలసి ఉన్న గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) నిమజ్జనోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గౌరమ్మను వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శారదానది వరకు ఊరేగించారు. భక్తులు ఉత్సాహంగా రథాన్ని ముందుకు తాళ్లతో లాగారు. బాణసంచా వెలిగించారు. నది ఒడ్డున సంప్రదాయంగా వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జనం జరిపారు. కాగా గౌరమ్మ ఉత్సవం పురస్కరించుకొని శనివారం రాత్రి నిర్వహించిన డాన్స్ బేబీ డాన్స్, డాన్స్ మస్తీ, బుర్రకథలు ఆకట్టుకున్నాయి. అర్ధరాత్రి దాటాక భారీగా బాణసంచా కాల్చారు. ప్రజలు ఆసక్తిగా తిలకించారు. వైఎస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఆలేశ సీఏస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు గోపీకృష్ణ, బొడ్డేడ సత్యసాయి బాలాజీ, పెంటకోట రాము, వేగి దొరబాబు, రామకోటేశ్వరరావు, బీశెట్టి ఆనంద్ ఉత్సవంలో పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

రాంబిల్లి : విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ నెల 13న అచ్యుతాపురం సబ్ డివిజన్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫోరం చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో అచ్యుతాపురం సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ వినియోగదారులందరూ తమ సమస్యలతో పాటు నిర్వహణపై తగు సూచనలు, సలహాలు అందించాలని ఆయన కోరారు. విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఈ సూచించారు.

నూతన బాలవికాస్ కేంద్రం ప్రారంభం



బాలవికాస్ గురువులకు సత్యసాయి భక్తి పుస్తకాలను అందిస్తున్న నారాయణపాత్రుడు

కె.కోటపాడు: బాల వికాస్ తరగతులతో విద్యార్థులకు విజ్ఞానం పెరగడంతోపాటు భక్తిభావం కలుగుతుందని మండల సత్యసాయి సేవా కార్యక్రమాల ఇన్‌చార్జి బండారు నారాయణపాత్రుడు తెలిపారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సూర్రెడ్డిపాలెంలో నూతన బాలవికాస్ కేంద్రాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు సెలవు రోజుల్లో ఇక్కడ రామాలయంలో బాల వికాస్ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాల వికాస్ గురువులకు సత్యసాయి భక్తి పుస్తకాలను నారాయణపాత్రుడు అందించారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ సమన్వయకర్త కసిరెడ్డి అప్పలనాయుడు, బీమేశ్వరరావు, దేముడు, మాజీ సర్పంచ్ సూర్రెడ్డి కన్నంనాయుడు పాల్గొన్నారు.

ఆరోగ్యశక్తిని పెంచే ఆయుర్వేదం



ఆయుర్వేద మందులు వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న డాక్టర్ సిద్ధి శ్రీనాథ్

అనకాపల్లి : ఆరోగ్యానికి శక్తిని పెంచేందుకు ఆయుర్వేదం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయుర్వేద వైద్యుడు సిద్ధి శ్రీనాథ్ అన్నారు. వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఆదివారం లాంగ్ వాకింగ్ నిర్వహించి, యార్డులో గుమస్తాల సంఘం కార్యాలయంలో ఆయుర్వేద మందులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభ్యులకు ఆయన వివరించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ నేటి సమాజంలో మానసిక ఒత్తిడితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నిత్యం వ్యాయామం చేయడం వల్ల శరీర ఒత్తిడిని తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఆయుర్వేదంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులకు మందులు ఉన్నాయని తెలిపారు. కరోనా వంటి విపత్తుల సమయంలో ఆయుర్వేదంపై ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంచుకున్నట్లు తెలిపారు. అనంతరం క్లబ్ సభ్యులు శ్రీనాథ్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బీశెట్టి రామకృష్ణ, కార్యదర్శి సాంబశివరావు, సీనియర్ సభ్యులు డీడీ నాయుడు, కె.వి.గోపీచరీ, నల్లం దేముళ్లు పాల్గొన్నారు.

మత్స్యకారులకు రాజకీయంగా గుర్తింపు ఇవ్వాలి



జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు అమ్మోరయ్య

నక్కపల్లి : మత్స్యకారులకు వచ్చే ఎన్నికల్లో తగిన గుర్తింపు ఇచ్చిన పార్టీకే మద్దతు ఇవ్వాలని ఆంధ్ర మత్స్యకార జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నక్కపల్లిలో జేఏసీ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు కంబాల అమ్మోరయ్య మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 30 లక్షల మంది మత్స్యకారులు ఉన్నారన్నారు. జనాభా ప్రాతిపదికన తగిన ప్రాధాన్యం ఉండదం లేదన్నారు. ఎన్నికల్లో ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే మత్స్యకారులను వాడుకుంటున్నారని ఆరోపించారు. కనీసం పది అసెంబ్లీ స్థానాలు, రెండు ఎంపీ స్థానాలను వాడ బలిజ మత్స్యకారులకు కేటాయించాలన్నారు. ఒక రాజ్యసభ స్థానాన్ని కూడా మత్స్యకారులకు ఇవ్వాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో కూడా మత్స్యకారులకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. తీర ప్రాంతాల్లో ఉన్న మత్స్యకార గ్రామాలను కాలుష్య కోరల్లో నుంచి రక్షించాలన్నారు. ఈ డిమాండ్లను మేనిఫెస్టోలో చేర్చి అమలు చేస్తామని ప్రకటించిన పార్టీలకు మాత్రమే వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. తమ హామీలు నెరవేర్చని వారికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారని జేఏసీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి ఉమ్మిడి సంజీవరావు అన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి పిక్కి కోదండరావు, జేఏసీ నాయకులు అప్పలరాజు, వెంకటేష్, సూరకాడు, రాజేష్, అర్జిల్లి శ్రీను, బోడిపల్లి ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జంపెనలో వాసవీమాతకు విశేష పూజలు



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

మాడుగుల రూరల్ : జంపెన వాసవీమాత ఆలయంలో ఆదివారం మహిళలు కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. అమ్మవారి ఆత్మార్పణ దినం సందర్భంగా సంకీర్తన, అనంతరం మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కింతలి గాదిరాజు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



'పల్లెకు పోదాం..రా' గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న కె.తాతారావు

అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామీణ స్థాయి నుంచి ప్రజలకు తెలియజేసేందుకు 'పల్లెకు పోదాం...రా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు బీజేపీ అనకాపల్లి మండల అధ్యక్షుడు కర్రిరి తాతారావు అన్నారు. మండలంలో తగరంపూడి గ్రామంలో పల్లెకు పోదాం...రా కార్యక్రమంలో భాగంగా పోస్టర్స్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడప గడపకు కమలం నినాదంతో ఇంటింటికీ మోదీ సందేశం వినిపిస్తున్నట్టు తెలిపారు. వికసిత సంకల్పయాత్ర ద్వారా ప్రజల్లోకి బీజేపీ సంక్షేమ పథకాలను విస్తరిస్తున్నట్టు పేర్కొన్నారు. పేదల సంక్షేమం, మహిళా సాధికారిత, దేశ అంతర్గత బాహ్య భద్రత, సంస్కృతి పునర్వైభవం వంటి విభిన్న రంగాల్లో ఊహించని అభివృద్ధి మోదీ పాలనలో జరిగిందన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ప్రధానమంత్రిగా మోదీని గెలిపించుకోవాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

అచ్యుతాపురం : కొండకర్ల ఆవ ప్రాంతం ఆదివారం పూర్వ విద్యార్థులతో సందడి నెలకొంది. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో 1986–87లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు కొండకర్ల ఆవ ప్రాంతంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నాటి తీపి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు.

విజయం చిన్నదైనా స్ఫూర్తి ఉజ్వలం

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో ఆదివారం అభినందన కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. విద్య, సాంస్కృతిక, క్విజ్, ఆటల పోటీలు, పోటీ పరీక్షల వంటి అనేక అంశాల్లో జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి, జిల్లా, పట్టణ స్థాయిలో ప్రతిభ కనబరిచిన, సూపర్ నూరు శాతం హాజరు కనబరిచిన శ్రీ ప్రకాష్ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులతో పాటుగా విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్ ప్రకాష్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 900 మంది జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి, జిల్లా, పట్టణ స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుల్లోనే కాకుండా వారికి ఇతర రంగాలలో కూడా అవకాశం కల్పించాలని శ్రీ ప్రకాష్ అన్ని రంగాలలోనూ ప్రాధాన్యం ఇచ్చి శిక్షణ ఇస్తోందని తెలిపారు.

అచ్యుతాపురంలో వైద్య శిబిరం

అచ్యుతాపురం: అచ్యుతాపురం శ్రీవిష్ణు ఆస్పత్రి వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీవిష్ణు ఆస్పత్రి 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సురక్ష హెల్త్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి,సీఐ బుచ్చిరాజు ప్రారంభించారు. ఈ శిబిరంలో 21 మంది రక్త దానం చేశారు. 29 చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 35 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్, 40 మందికి డెంటల్ పరీక్షలు,180 మందికి జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించారు. రెడ్డి గణేశ్,ఎంపీటీసీ లాలం శ్రీను పాల్గొన్నారు. బ్రాండిక్స్ అపారెల్ పార్కులో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 340 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.

విశాఖ జట్టులో రాణిస్తున్న రావికమతం యువకులు



జట్టులో రావికమతం మండల యువకులు

రావికమతం: విశాఖ నగరంలో నిర్వహిస్తున్న ఆడుదాం–ఆంధ్రా రాష్ట్ర స్థాయి పోటీల్లో విశాఖ జిల్లా వాలీబాల్ జట్టు ఆదివారం సెమీఫైనల్‌కు చేరింది. ఈ జట్టులో రాణిస్తున్న యువకుల్లో రావికమతం మండలం గుమ్మళ్లపాడు, చినపాచిలకు చెందిన పవన్‌కుమార్, సాయిబాబు, గుమ్మళ్లపాడుకు చెందిన బంటు రమేష్, కుమార్ ఉన్నారు. ఆదివారం నెల్లూరు, గుంటూరు జిల్లాల జట్లతో పోటీ పడి విజయం సాధించిన విశాఖ జట్టు సెమీఫైనల్‌కు చేరిందని గ్రామ యువకులు ఆనందం వ్యక్తం చేశారు.

బ్రాహ్మణ సంఘానికి సొంత భవనం

దాతల విరాళాలతో జోరుగా నిర్మాణ పనులు



బ్రాహ్మణ సంఘ భవనం వద్ద జరుగుతున్న పనులు

నక్కపల్లి : మండల కేంద్రంలో తాలూకా బ్రాహ్మణ సంక్షేమ సంఘ భవనానికి పలువురు సంఘ ప్రతినిధులు, సభ్యులు, శ్రేయోభిలాషుల విరాళాల ప్రకటించడంతో అసంపూర్తిగా నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు జోరందుకున్నాయి. పదేళ్ల క్రితం ఈ భవన నిర్మాణాన్ని సంఘ సభ్యులు, ఇతర దాతలు సమకూర్చిన సుమారు రూ.15లక్షల విరాళాలతో ప్రారంభించారు. తరువాత నిధులు సరిపోక భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. రెండు మాసాల క్రితం జరిగిన కార్తీక వన సమారాధన సమయంలో సంఘ పెద్దలు ఈ విషయాన్ని సర్వసభ్య కమిటీలో ప్రస్తావించడంతో పలువురు సంఘ సభ్యులు తమకు తోచిన రీతిలో విరాళాలు ప్రకటించారు. నక్కపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు వీసం రామకృష్ణ, వీసం నానాజీ సుమారు లక్ష రూపాయల బోరు నిర్మాణానికి ఆర్థిక సాయం అందించారు. పలువురు సంఘ ప్రతినిధులు సిమెంట్, ఇసుక, ఇతర మెటీరియల్‌ను విరాళంగా ప్రకటించడంతో నిర్మాణ పనులు జోరందుకున్నాయి. నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల బ్రాహ్మణ సోదరులకు ఉపయోగపడే విధంగా ఈ భవనాన్ని తీర్చి దిద్దుతున్నామని సంఘ ప్రతినిధులు డి.వి.రామారావు, గొట్టుము కృల వరప్రసాద్, శ్రీపాద ప్రవీణ్, ఇంద్రకంటి బాబి, వసర కొండ పండు, శ్రీపాద ప్రసాద్ తెలిపారు.

యూటీఎఫ్ జిల్లా నాయకుల వినతి



డిప్యూటీ సీఎం బూడికి వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మాడుగుల: జిల్లా ఐక్య ఉపాధ్యాయ సంఘం(యూటీఎఫ్) జిల్లా నాయకులు ఆదివారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును తారువ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ అమలు చేయాలని, ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. వీటి డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి, కార్యదర్శి దొగ్గ శ్రీను, సీనియర్ నాయకులు కుదర కామరాజు, బొడ్డపాటి రామచంద్రరావు పాల్గొన్నారు.

వలస జీవుల బతుకు బాట



యలమంచిలిలో వలస కార్మికుల బస

- పొట్ట చేతపట్టుకుని వందల కిలోమీటర్ల పయనం
- వ్యవసాయ పనిముట్లు, కిచెన్ వస్తువుల తయారీ
- ఏటా ఆరు నెలల పాటు సంచార జీవనం



కళాయి తయారు చేస్తున్న వలస కూలీ

యలమంచిలి రూరల్ : కష్టాన్నే నమ్ముకున్న వారికి భూమి, ప్రాంతంతో పనిలేదని నిరూపిస్తున్నారు మధ్యప్రదేశ్ నుంచి మన రాష్ట్రానికి వలస వస్తున్న కష్టజీవులు. కొలిమిలో ఇనుమును కరిగించి..రెక్కలు ముక్కలు చేసుకుంటూ వ్యవసాయ పనిముట్లు తయారు చేసి అమ్ముకుంటూ కుటుంబాలను పోషించుకోవడం.. ఇదొక్కటే తరతరాలుగా వాళ్లకు తెలిసిన పని. మహిళలు కొలిమి వేసి పాత ఇనుము కాలిస్తే పురుషులు సమ్మెట దెబ్బలు వేసి వస్తువులు తయారు చేస్తుంటారు. గొడ్డలి, కొడవలి, కత్తులు, గడ్డ పారలు, పారలు, సమ్మెట, కళాయి, దోసె పెనం, కురిడీ, వంటింటి కత్తి పీటలు ఇలా వ్యవసాయానికి, ఇళ్లలో వినియోగించే పనిముట్లను వీరు తయారు చేసి రోడ్డు పక్కనే టార్పాలిన్లపై ఆ వస్తువులను అమ్ముకానికి ఉంచుతారు. కొందరు పట్టణంలోని వీధులు, చుట్టు పక్కల ఊళ్లలో వీటిని తీసుకెళ్లి విక్రయిస్తూ బతుకు పోరాటం చేస్తున్నారు. ఎక్కడ వర్కషాపులు ఉంటే ఆ ప్రాంతంలో ఈ పనిముట్లు ఎక్కువగా విక్రయించడానికి బయలుదేరి పోతుంటారు. ఇలా ఒకటో ఇద్దరో కాదు.ఏటా మధ్యప్రదేశ్ నుంచి కొన్ని వందల కుటుంబాలు ఆంధ్రప్రదేశ్‌కు పొట్ట చేత పట్టుకుని వస్తున్నారు. ఏదాదిలో ఆరు నెలలు ఊరూరా తిరుగుతూ వ్యవసాయ పనిముట్లు, వంట గదుల్లో ఉపయోగించే వివిధ రకాల వస్తువులను తయారుచేసి వాటిని అమ్ముకుంటూ నాలుగు డబ్బులు సంపాదించుకుని, తిరిగి సొంతూళ్లకు వెళ్లి జీవనం సాగిస్తుంటారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఖండవా జిల్లా ముందిగం మండలం నింబాడ్ ప్రాంతానికి చెందిన వలస కార్మికులు 10 కుటుంబాలు అనకాపల్లి జిల్లాలో వివిధ పట్టణాలకు వలస వచ్చారు. యలమంచిలిలో ప్రధాన రహదారి పక్కన త్రిమూర్తుల స్వామి గుడి సమీపంలో గుడారాలు వేసుకున్నారు.

దొరకాలంటే రెక్కాడాల్సిందే..

యాంత్రీకరణ గణనీయంగా పెరిగిన ఈ రోజుల్లోనూ వారు చేతి వర్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఉదయం 7 గంటలకు మొదలయ్యే పని రాత్రి 7 వరకూ కొనసాగుతూనే ఉంటుంది. లారీల క్రష్ ప్లేట్లు, ఇతర పాత ఇనుమును కొలిమిలో కాల్చి ఇనుమును కరిగించిన తర్వాత సమ్మెట సాయంతో అమ్మకానికి అవసరమైన పనిముట్లు తయారు చేస్తుంటారు. కొడవలి సైజును బట్టి రూ.50 నుంచి రూ.200 వరకు, గొడ్డలి రూ.150 నుంచి రూ.300 వరకు మాంసం కత్తి రూ.100 నుంచి రూ250 వరకు, కళాయి రూ.500 నుంచి రూ.1000 వరకు, చిన్న సైజు పెనం రూ.300 నుంచి రూ.500 వరకు కత్తి పీట రూ.200 నుంచి రూ.350 వరకు అమ్ముతున్నారు.

ఇదే జీవనోపాధి



మా పెద్దల నుంచి వ్యవసాయ పనిముట్లు,వంట గదిలో అవసరమైన వస్తువులు తయారీ నేర్చుకున్నాం. గిరాకీ ఆధారంగా ఒక ప్రాంతంలో 10 రోజుల నుంచి రెండు వారాల వరకు తయారు చేసిన వస్తువులను అక్కడ విక్రయించి ఉపాధి పొందుతున్నాం. తెలుగు రాష్ట్రాల ప్రజలు మమ్మల్ని ఆదరిస్తున్నారు.

–మోహన్‌రావు, మధ్యప్రదేశ్

చిన్నప్పటి నుంచి ఇదే పని



మా తల్లిదండ్రులు వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తూ ఈ పని మాకు అలవాటు చేశారు. మధ్యప్రదేశ్‌లో మా పనిముట్లకు గిరాకీ ఉండదు. అందుకే జీవనోపాధికోసం ఇక్కడకు వచ్చాం. బొగ్గులు, నిత్యావసర సరుకుల ఖర్చులు పోను రోజుకు రూ.400 నుంచి రూ500 వరకు సంపాదిస్తున్నాం.

– రాంబాబు,మధ్యప్రదేశ్

ఇంటర్ ప్రయోగ పరీక్షలు ప్రారంభం

యలమంచిలి రూరల్ : ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో మొదటి విడత ప్రయోగ పరీక్షలు ప్రారంభించినట్టు ఆయా పరీక్ష కేంద్రాల ముఖ్య పర్యవేక్షణాధికారులు తెలిపారు. ఆదివిధంగా పరీక్షల్లో ఎటువంటి అక్రమాలు జరగకుండా ప్రయోగశాలల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.